# మత్తు వదలని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు!

## కాలేజీ దశనుంచే డ్రగ్స్‌తో దోస్తీ • ఇటీవల పట్టుబడిన వారిలో టెకీలు, ఇంజినీరింగ్ విద్యార్థులే అధికం

### మత్తుకు బానిసలై పెడ్లర్లుగా మారుతున్న వైనం • పబ్బుల్లోనూ జోరుగా అమ్మకాలు • చూసీ చూడనట్టు వదిలేస్తున్న యజమానులు



హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): 'సరిపోదా శనివారం' అంటే.. హ్యాంగ్ ఓవర్ దిగడానికి సోమవారం కూడా సెలవు కావాలనే సాఫ్ట్‌వేర్ మత్తుబాబులు పెరిగిపోతున్నారు. సోమవారం రాగానే వచ్చే వీకెండ్‌ను ఎక్కడ, ఎలా ఎంజాయ్ చేయాలో పక్కాగా ప్లాన్ చేసుకుంటున్నారు. ఆ పార్టీకి కావల్సిన గంజాయి, హెరాయిన్, కొకైన్ లాంటి డ్రగ్స్‌ను డార్క్‌వెబ్ నుంచి ఆర్డర్ చేసుకుంటున్నారు. ఆపై మత్తులో జోగుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇలా ఖమ్మానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇటీవల డార్క్‌వెబ్ ద్వారా డ్రగ్స్ కొనుగోలు చేసి పట్టుబడ్డాడు. ఇటీవల ఇలా పట్టుబడినవారిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రైవేట్ ఉద్యోగులు, ఇంజినీరింగ్ విద్యార్థులే ఎక్కువగా కనిపిస్తున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు డార్క్‌సైట్‌లో తెలంగాణవారికి 'నో సెల్లింగ్' బోర్డులు పెట్టగా.. ఇప్పుడు అదే డార్క్‌సైట్‌లో 'స్టాక్ అవైలబుల్ ఫర్ ఆల్' అనే బోర్డులు దర్శనమిస్తున్నాయి.

**ఇంజినీరింగ్ దశ నుంచే**

ఈ ఏడాది తొలి 3 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 500కుపైగా ఎన్డీపీఎస్ కేసుల్లో 981 మంది పట్టుబడ్డారు. వీరిలో దాదాపు 70% మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ఇంజినీరింగ్ విద్యార్థులే ఉన్నట్టు టీజీన్యాబ్ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు టీజీన్యాబ్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన దాడుల్లోనూ సాఫ్ట్‌వేర్ టెకీలు, ఇంజినీరింగ్ విద్యార్థులే ఎక్కువగా పట్టుబడటం ఆందోళన కలిగిస్తున్నది. వారిలో కొందరు ఇంజినీరింగ్ చదువుతున్నప్పుడే తమకు గంజాయి మత్తు అలవాటు అయినట్టు చెప్తున్నారు. ఇటీవల ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజ్‌లో గంజాయి సేవిస్తూ పదుల సంఖ్యలో ఇంజినీరింగ్ విద్యార్థులు పట్టుబడ్డారు. వారిని 'నమస్తే తెలంగాణ' ప్రశ్నించగా.. తమ కళాశాలలోని ఉత్తరాది విద్యార్థులు గంజాయి అలవాటు చేశారని, ఆ తర్వాత తాము ధూల్‌పేటకు వెళ్లి గంజాయి తెచ్చుకున్నామని తెలిపారు.

**పెడ్లర్లుగా మారుతున్న టెకీలు**

ఒకసారి మత్తుకు బానిసైన తర్వాత తమకు ఏం చేయాలో అర్థం కావడం లేదని, ప్రతిసారి ఇంట్లో డబ్బులు అడగలేక గంజాయి, సింథటిక్ డ్రగ్స్ అమ్మేవారితో స్నేహం పెంచుకుని వాటిని ఇతరులకు విక్రయిస్తున్నామని కొందరు విద్యార్థులు, టెకీలు చెప్తున్నారు. మరోవైపు పబ్స్‌లోనూ డ్రగ్స్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వీటికి చెక్‌పెడితే తమ పబ్బులకు ఎవరూ రారని భావించి యజమానులు చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. దీంతో డ్రగ్స్ కట్టడి మరింత కష్టతంగా మారిందని టీజీన్యాబ్ అధికారులు చెప్తున్నారు.



## దాతలు దయతలిస్తే 'సీఎం బ్రేక్ ఫాస్ట్'

- బీఆర్ఎస్ పథకానికి నయా పైసా విడుదల చేయని సర్కారు
- పేరు మార్చి దాతల సహకారంతో అమలుకు నిర్ణయం
- కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టే అవకాశం

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): సర్కారు బడుల్లో విద్యార్థుల ఆకలిని తీర్చేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం అమలుచేసిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసింది. విద్యార్థుల్లో రక్తహీనతను రూపుమాపడం, పోషకాహారాన్ని అందించడమే లక్ష్యంగా నాడు తెచ్చిన ఈ పథకానికి 8 నెలలుగా రాష్ట్ర సర్కారు నిధులు విడుదల చేయకపోవడంతో దాని లక్ష్యం నీరుగారింది. దీంతో బీఆర్ఎస్ సహా విపక్షాల నుంచి తీవ్రమైన విమర్శలు రావడంతో అనివార్య పరిస్థితుల్లో ఈ పథకాన్ని మరో తీరుగా అమలుచేసేందుకు సిద్ధపడింది. ఈ పథకాన్ని దాతల సహకారంతో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది. ఈ పథకం పేరు మార్చి కొత్త పథకంగా అమలుచేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్ట్‌గా ఈ బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని మళ్లీ ప్రారంభించనున్నారు. ఆ తర్వాత రాష్ట్రమంతటా ఈ పథకాన్ని విస్తరించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకానికి ఏటా రూ.700 కోట్లు ఖర్చు చేయాల్సి ఉన్నది. రేవంత్‌రెడ్డి సర్కారు ఆ నిధులివ్వలేక దాతలు, సీఎస్సార్ నిధుల వేటలో పడింది. వాస్తవానికి బ్రేక్‌ఫాస్ట్ స్కీం పాతదే. అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని సర్కారు నిలిపివేసింది. నయా పైసా విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది.

**23 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి**

రాష్ట్రంలో 2023 అక్టోబర్ 6న సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అప్పటి మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి రంగారెడ్డి జిల్లాలోని రావిర్యాల పాఠశాలలో ప్రారంభించారు. 23 లక్షల విద్యార్థులకు లబ్ధిచేకూర్చేలా ఈ పథకాన్ని కేసీఆర్ సర్కారు రూపకల్పన చేసింది. వాస్తవంగా ఈ పథకం యావత్తు దేశానికే ఆదర్శమైంది. పీఎం పోషణ్ స్కీంలో భాగంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలుచేయాలని కేంద్రం భావిస్తున్నది.

**బ్రేక్ ఫాస్ట్ లబ్ధిదారులు (గతంలో)**

| యాజమాన్యం | 1-5 తరగతులు | 6 నుంచి 8 తరగతులు | 9, 10 తరగతుల్లో |
|---|---|---|---|
| ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ | 11,57,541 | 6,18,463 | 3,65,138 |
| ఎయిడెడ్ | 37,473 | 23,340 | 13,823 |
| మాడల్ స్కూళ్లు | --- | 49,715 | 36,270 |
| మదర్సాలు | 2493 | 1,491 | 54 |
| మొత్తం | 11,97,507 | 6,93,009 | 4,15,285 |

# ఫార్మా.. రోజుకో డ్రామా!

**ఫార్మాసిటీపై రేవంత్ సర్కారు డొంకతిరుగుడు!**

**రద్దు చేశామని ఒకసారి.. చేయలేదని మరోసారి..!**

- మీడియాకు చెప్పేదొకటి.. కోర్టు ముందు మరొకటి!
- ఫార్మా విలేజ్, ఫార్మా క్లస్టర్ అంటూ పూటకో మాట
- జిల్లాల్లోనూ పెడ్తామంటూ ప్రభుత్వాధినేత ప్రకటనలు
- అనేకచోట్ల ఇప్పటికే మొదలైన భూసేకరణ ప్రక్రియ
- ఫార్మా బదులు స్పోర్ట్స్ విలేజ్‌ని తెరపైకి తెచ్చిన సర్కార్!
- ప్రాజెక్టు రద్దయితే భూములు తిరిగివ్వాలన్నది నిబంధన
- రాష్ట్ర ప్రభుత్వం తేల్చి చెప్పాలని పట్టుబడుతున్న రైతులు



హైదరాబాద్, సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ): ఫార్మాసిటీపై రాష్ట్రప్రభుత్వం డొంకతిరుగుడు వైఖరిని అవలంబిస్తున్నది. ఉంటుందంటూ ఒకసారి, చేపట్టలేమని మరోసారి ప్రకటిస్తూ గందరగోళం సృష్టిస్తున్నది. ప్రాజెక్టును చేపట్టలేక.. వద్దని చెప్తే సేకరించిన రైతుల భూములు వెనక్కి ఇవ్వలేక రోజుకో మాట చెప్తున్నది, ప్రభుత్వాధినేత కూడా రెండునాల్కల ధోరణిని అవలంబిస్తున్నారు. ఆయనే ఒకటిరెండు సార్లు ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్టు స్వయంగా ప్రకటించారు. ఒకసారి ఫార్మా సిటీ!.. మరోసారి ఫార్మా విలేజ్!.. ఇంకోసారి జిల్లాల్లో ఫార్మా క్లస్టర్స్! ఇట్లా సీఎం వైఖరి కూడా మారుతూ వచ్చింది. మీడియా ముందు, కాంగ్రెస్ సభల్లో చెప్తున్నదానికి పొంతన ఉండటం లేదు. సీఎం వ్యాఖ్యల తర్వాత జిల్లాల్లోనూ ఫార్మా క్లస్టర్లకు ప్రక్రియ మొదలైంది. పలుచోట్ల భూసేకరణ కూడా కొనసాగుతున్నది. దాన్ని వ్యతిరేకిస్తూ పలు జిల్లాల్లో రైతులు రోడ్డెక్కుతున్నారు. అంటే ఫార్మాసిటీ రద్దుపై ప్రభుత్వం ప్రాథమికంగా ఒక నిర్ణయం తీసుకున్న మాట నిజం! జిల్లాల్లో ఆ ప్రక్రియ కొనసాగుతుండటం నిజం! కానీ హైకోర్టుకు మాత్రం ప్రభుత్వం వేరేవిధంగా చెప్తున్నది. తన దాగుడుమూతలతో న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టిస్తున్నది.

నిబంధనల ప్రకారం ఒక ప్రాజెక్టు కోసం రైతుల నుంచి భూమిని సేకరిస్తే.. ఆ భూమిని దాని కోసమే వినియోగించాలి. మరో పనికోసమో, మరో ప్రాజెక్టుకోసమో ఆ భూములను వాడటానికి వీల్లేదు. ఒకవేళ ఫార్మాసిటీ రద్దు చేస్తే.. దాని కోసం రైతుల నుంచి సేకరించిన 13 వేల ఎకరాలను తిరిగి ఇచ్చేయాల్సి ఉంటుంది. అందుకే రేవంత్ ప్రభుత్వం రద్దును అధికారికంగా ప్రకటించలేకపోతున్నది. మరోవైపు అక్కడ స్పోర్ట్స్ విలేజ్ కడుతామని సన్నాయినొక్కులు నొక్కుతున్నది. భూముల్ని మరో ప్రాజెక్టుకు బదలాయించడం చట్టవిరుద్ధమని న్యాయనిపుణులు చెప్తున్నారు. ఫార్మాసిటీయే లేనప్పుడు మా భూముల్ని వెనక్కి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అనేకచోట్ల ఫార్మాసిటీకి భూసేకరణ మొదలైంది. అంటే ఫార్మాసిటీ రద్దుపై ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నది. క్షేత్రస్థాయిలో ఆ ప్రక్రియ కొనసాగుతున్నది. ఇది నిజం! కానీ, హైకోర్టుకు మాత్రం ప్రభుత్వం వేరే విధంగా చెప్తున్నది. న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టిస్తున్నది. ఫార్మాసిటీని రద్దు చేసి వివిధ ప్రాంతాల్లో 10 ఫార్మా విలేజ్‌లను ఏర్పాటుచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో ప్రకటించిన విషయం విదితమే. అయితే, ప్రభుత్వం కోర్టుకు శనివారం సమర్పించిన అఫిడవిట్‌లో మాత్రం.. ఫార్మాసిటీని రద్దుచేసినట్టు ఎక్కడా ఉత్తర్వులు ఇవ్వలేదని, మీడియాలో వచ్చిన కథనాలు ప్రామాణికం కాదని పేర్కొన్నది. దీంతో ప్రభుత్వం రెండు నాల్కల వైఖరి అవలంబిస్తున్నదనే విమర్శలొస్తున్నాయి.

ఈ ఏడాది ఫిబ్రవరి 27న జరిగిన బయోఏషియా వార్షిక సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో నలువైపులా ఫార్మా విలేజ్‌లను ఏర్పాటుచేస్తామని, 1000 నుంచి రెండు వేల ఎకరాల విస్తీర్ణంలో, రూ.లక్ష కోట్ల పెట్టుబడితో 10 ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటుచేస్తామని, ముందుగా వికారాబాద్, మెదక్, నల్లగొండ జిల్లాల్లో వీటిని తీసుకొస్తామని చెప్పారు. కాగా, ఆయా జిల్లాల్లో భూములు అందుబాటులో లేవని కలెక్టర్లు స్పష్టంచేశారు. తాజాగా, ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లోనే సుమారు 1000 నుంచి 2000 ఎకరాల్లో గ్రీన్ ఫార్మాసిటీని ఏర్పాటు చేసేందుకు టీజీఐఐసీ అధికారులు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నారు. వాస్తవానికి గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల కేంద్రంగా కందుకూరు, యాచారం, కడ్తాల్ మండలాల పరిధిలో ఫార్మాసిటీ కోసం 13వేల ఎకరాల భూమిని సేకరించారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గరగా ఉండటంతో ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు దేశ, విదేశాలకు చెందిన అనేక కంపెనీలు ముందుకొచ్చాయి. ఫార్మాసిటీకి అవసరమైన పర్యావరణ అనుమతులు కూడా వచ్చాయి. కాగా, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు అక్కడ ఫ్యూచర్‌సిటీ పేరుతో కొత్త నగరాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. కానీ, నిబంధనల ప్రకారం ఒక ప్రాజెక్టు కోసం రైతుల నుంచి భూమిని సేకరిస్తే.. ఆ భూమిని దానికోసమే వినియోగించాలి. మరో అవసరానికి ఆ భూములను వినియోగించే వీలులేదు. అందు కే తమ నుంచి సేకరించి భూములను వెనక్కి ఇచ్చివేయాలని రైతులు కోరుతున్నారు. కానీ, ఫార్మాసిటీ కోసం భూములు సేకరించిన ప్రాం తంలో స్పోర్ట్స్ విలేజ్ కడతామని ప్రభుత్వం చెప్తున్నది. అట్లా మళ్లించడం చట్ట విరుద్ధమని న్యాయనిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యం లో ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన కొందరు రైతులు కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ప్రభుత్వానికి ఏమిచేయాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఫార్మాసిటీ యథా ప్రకారం కొనసాగుతుందని, రద్దుచేస్తున్నట్టు ఎటువంటి విధానపరమైన నిర్ణయం తీసుకోలేదని రాష్ట్ర ప్రభుత్వం.. కోర్టుకు శనివారం నివేదించింది.

**ఆనవాళ్లు లేకుండా చేయబోయి...**

తెలంగాణ రాష్ట్రం దేశ ఔషధ రంగానికి రాజధానిగా కొనసాగుతున్నది. దేశం నుంచి ఎగుమతి అవుతున్న ఫార్మా ఉత్పత్తుల్లో మూడింట ఒక వంతు మన రాష్ట్రం నుంచే వెళ్తున్నాయి. వ్యాక్సిన్ క్యాపిటల్‌గా కూడా మన రాష్ట్రానికి పేరున్నది. కొవిడ్ వ్యాక్సిన్లలో సింహభాగం మన రాష్ట్రం నుంచే ప్రపంచానికి ఎగుమతి అయ్యాయి. కేసీఆర్ ప్రభుత్వం అనుసరించిన స్నేహపూర్వక విధానాల వల్ల ఈ రంగం గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందింది. ఔషధ రంగంలో రాష్ట్రానికి ఉన్న సుస్థిర స్థానాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం భారీస్థాయిలో ఫార్మాసిటీ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. దీనికి అవసరమైన పర్యావరణ అనుమతులను కూడా సాధించింది. ఈ నేపథ్యంలో తాజాగా రేవంత్ ప్రభుత్వం రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలనే తలంపుతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మాసిటీపై కక్షపూరిత ధోరణి అవలంబిస్తున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఫ్యూచర్ సిటీ ఎక్కడ?

ఫార్మాసిటీ కోసం 13,000 ఎకరాలు సేకరించగా, తాజాగా ప్రభుత్వం పేర్కొంటున్న గ్రీన్ ఫార్మాసిటీని రెండువేల ఎకరాల్లో ఏర్పాటు చేసేందుకు టీజీఐఐసీ ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిసింది. ప్రభుత్వం కోర్టుకు నివేదించిన ప్రకారం ఫార్మాసిటీని ఏర్పాటుచేస్తే సేకరించిన భూముల్లో ఫార్మాసిటీ రావాల్సి ఉన్నది. ఒకవేళ ఫార్మాసిటీని రెండు వేల ఎకరాలకే పరిమితం చేస్తే మిగిలిన 11 వేల ఎకరాలను దేనికోసం వినియోగిస్తారనేది ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. ముచ్చర్ల కేంద్రంగా ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నట్టు సీఎం ఇప్పటికే ప్రకటించారు. ఒకవేళ ప్రభుత్వం కోర్టుకు నివేదించిన విధంగా ఫార్మాసిటీని కొనసాగిస్తే ఫ్యూచర్‌సిటీని ఎక్కడ ఏర్పాటుచేస్తారో చెప్పాలని పలువురు కోరుతున్నారు. ఫార్మాసిటీని 13 వేల ఎకరాల్లో ఏర్పాటుచేస్తే సీఎం చెప్తున్న ఫార్మా విలేజ్‌ల కథ కంచికి చేరినట్టేనా? అనే సందేహాలూ వ్యక్తమవుతున్నాయి. లేదంటే ఫార్మాసిటీతోపాటు పది ఫార్మావిలేజ్‌లను కూడా ఏర్పాటుచేస్తారా? ఇవన్నీ ప్రస్తుతం సామాన్య ప్రజలను, భూములిచ్చిన రైతులనే కాకు ండా పరిశ్రమ వర్గాలను కూడా వేధిస్తున్న ప్రశ్నలు. ప్రభుత్వ అయోమయ ధోరణి వల్ల పెట్టుబడులు పెట్టాలనుకుంటున్న కంపెనీలకు ఏమి చేయాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది.

- రైతుల భూములను లాక్కుని ప్రభుత్వం చేపట్టిన ఫార్మాసిటీని అధికారంలోకి రాగానే రద్దు చేస్తాం.
  **అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ హామీ**
- ఫార్మాసిటీని తరలిస్తాం. మెట్రో రూటును మార్చేస్తాం. ప్రస్తుత ఫార్మా సిటీ స్థానంలో ఔటర్ చుట్టూ మెగా టౌన్‌షిప్‌లు ప్లాన్ చేస్తున్నం
  **2023 డిసెంబర్ 13న సీఎం రేవంత్‌రెడ్డి**
- ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించడం శుభపరిణామం.
  **2023 డిసెంబర్ 14న మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, కాంగ్రెస్ ఆదివాసీ విభాగం చైర్మన్ బెల్లయ్యానాయక్**
- ఫార్మాసిటీని రద్దు చేయడం లేదు.
  **2024 డిసెంబర్ 13న సీఎం రేవంత్‌రెడ్డి వివరణ**

## 'గీతం' వర్సిటీ కోటి విరాళం

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి సహాయనిధికి గీతం యూనివర్సిటీ రూ.కోటి విరాళం ఇచ్చింది. జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం గీతం వర్సిటీ ప్రెసిడెంట్, ఎంపీ శ్రీభరత్ చెక్కు అందజేశారు. కాగా, సిక్కు మత స్థాపకుడు గురునానక్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నివాళులర్పించారు.

## మహా వికాస్ అఘాడీ సీట్ల పంపకం కొలిక్కి!

**శాసన సభ ఎన్నికల కోసం వేగంగా సమాయత్తం**

ముంబై, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : త్వరలో జరిగే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) వేగంగా అడుగులు వేస్తున్నది. భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల పంపకం ఫార్ములా దాదాపుగా ఖరారైంది. లోక్‌సభ ఎన్నికల్లో లభించిన విజయాల నేపథ్యంలో కాంగ్రెస్ దూకుడు ప్రదర్శిస్తున్నది. ముంబైలోని 90 శాతం సీట్లలో ఏకాభిప్రాయం కుదిరిందని ఎంవీఏ వర్గాలు చెబుతున్నాయి. శుక్రవారం జరిగిన ఎంవీఏ సమావేశంలో కాంగ్రెస్ 115 సీట్లు కావాలని పట్టుబట్టగా, శివసేన (యూబీటీ) కనీసం 100 సీట్లు కావాలని పట్టుబట్టినట్లు సమాచారం. అయితే చివరికి కాంగ్రెస్ 105 స్థానాల్లో, ఉద్ధవ్ గ్రూపు 95 స్థానాల్లో పోటీ చేసేందుకు అంగీకరించినట్లు తెలుస్తున్నది. ముంబైలో 23 స్థానాలు ఇవ్వాలని శివసేన (యూబీటీ) డిమాండ్ చేయగా, 22 సీట్లు ఇచ్చేందుకు అంగీకారం కుదిరినట్లు సమాచారం. మిగిలిన 14 స్థానాలు కాంగ్రెస్,ఎన్సీపీ పంచుకోవలసి ఉంటుంది.

# మూడ్నెల్లుగా జీతాల్లేవ్!

మొదటిపేజీ తరువాయి...



పాల్వంచలో జీతాల కోసం నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు(ఫైల్)

నెలకొన్నదని చెప్తున్నారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖల ప్రధాన కార్యాలయాలు, జిల్లా, మండల కార్యాలయాలు, క్షేత్రస్థాయిలో ఔటసోర్సింగ్, పార్ట్‌టైం, హానరోరియం, కాంట్రాక్ట్ ప్రాతిపదికపై దాదాపు 1.50 లక్షల మందికిపైగా పనిచేస్తున్నారు. అటెండర్లు, పారిశుద్ధ్య కార్మికులు, వాచ్‌మెన్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, వైద్యరంగంలో ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, హెల్త్ అసిస్టెంట్లు, విద్యారంగంలో బోధన, బోధనేతర విభాగాల్లో, స్పెషలాఫీసర్లుగా, అటవీశాఖలో వాచర్లుగా, ఉపాధి హామీ పథకంలో ఎఫ్ఏలుగా, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న ప్రత్యేక ప్రాజెక్టుల్లో ఫీల్డ్ లెవల్ ఆఫీసర్లు, ట్రైనర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ప్రాజెక్టు ఆఫీసర్లు, ఇరిగేషన్‌శాఖలో పంప్‌హౌజ్‌లో నైట్‌వాచ్‌మెన్లు, ఎలక్ట్రీషియన్లు, మెకానికల్ ఇంజినీర్లు, ఆపరేటర్లు ఇలా దాదాపు అన్ని శాఖల్లో ఏదో ఒక విభాగంలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. కొన్ని ప్రభుత్వశాఖలు నేరుగా వీరిని నియమించుకోగా, మరి కొన్ని శాఖలు జిల్లాలవారీగా మ్యాన్‌పవర్ ఏజెన్సీల ద్వారా నియమించుకున్నాయి.

**4 నుంచి 9 నెలలుగా అందని వేతనాలు**

ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు ఎలా అందుతున్నాయో చెప్పేందుకు ఒక్క సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీనే నిదర్శనంగా నిలుస్తున్నది. సొసైటీలో పరిధిలోని పాఠశాలలు, కాలేజీలు, సీవోఈల్లో, కళాశాలల్లో, స్పోర్ట్స్ అకాడమీల్లో ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం, గెస్ట్‌ఫ్యాకల్టీ, హానరోరియంపై వేల మంది పనిచేస్తున్నారు. సదరు సిబ్బందికి ప్రభుత్వం జూన్, జూలై, ఆగస్టు వేతనాలనూ ఇప్పటికీ చెల్లించలేదు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, సెర్ప్, ఉపాధిహామీ పథకం ఉద్యోగులు, వీవోఏలు, వాచర్లు.. ఇలా ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సంబంధించి సగటున 4–9 నెలలుగా జీతాలు పెండింగ్‌లోనే ఉన్నాయి.

**కాళ్ల మీద పడుతున్నా కనికరించని సర్కారు**

జీతాల కోసం ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తమ శాఖల ఉన్నతాధికారుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఎక్కే మెట్టు, దిగే మెట్టు అన్నవిధంగా ప్రధాన కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించేందుకు వెళ్లిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కాళ్లపై పడి జీతాలు చెల్లించాలని అక్కడి ఓ గేట్ ఆపరేటర్ వేడుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అయినా సర్కారు ఏమాత్రం కనికరం చూపించని దుస్థితి నెలకొన్నది. వాస్తవంగా చాలా శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది గడువు జూన్ 31తోనే ముగిసింది. ఆయాశాఖల అధికారులు సదరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సర్వీస్ రెన్యువల్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వారిని ప్రస్తుతం మౌఖిక ఆదేశాలతో పనిచేయించుకుంటున్నారు తప్ప ప్రభుత్వం ఇంకా ఆమోదముద్ర వేయలేదు. అటు ప్రతిపాదనలు పట్టించకోక.. బకాయి వేతనాలు చెల్లించక ప్రభుత్వం నాన్చుతున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే మానవీయకోణంలో స్పందించి వేతనాలను విడుదల చేయాలని ఔటసోర్సింగ్ సిబ్బంది కోరుతున్నారు.

**తక్షణమే వేతనాలు చెల్లించాలి**

> ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడంతో అనేక మంది అప్పుల పాలయ్యారు. ప్రస్తుతం అప్పు కూడా పుట్టని పరిస్థితి నెలకొన్నది. పండుగ సమీపిస్తున్నది. ప్రభుత్వం తక్షణం మానవీయకోణంలో స్పందించాలి. బకాయి వేతనాలు చెల్లించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే ఆదుకోవాలి.
>
> *– పులి లక్ష్మయ్య, తెలంగాణ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు*

## 'తెలంగాణ' యోధుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించాలి

**సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని విజ్ఞప్తి**

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సాయుధ పోరాటంలో ముందువరుసలో నిలిచిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటుచేసి వారి స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాలని కోరారు. బొమ్మగాని ధర్మభిక్షం, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, నలమల్ల గిరిప్రసాద్ విగ్రహాలను వారి జిల్లాల కూడళ్లలో ప్రతిష్ఠించి సముచిత గౌరవం ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు.


## బదిలీ ఉద్యోగులకు భత్యాల్లేవు!

- వైద్యారోగ్య శాఖలో అవస్థలు
- కొత్తస్టేషన్లలో చేరినా అందని జీతాలు
- రెండు నెలలుగా తప్పని ఆర్థిక ఇబ్బందులు

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్య శాఖలో అస్తవ్యస్త బదిలీల పరిణామాలు వైద్యులు, సిబ్బందిని పట్టిపీడిస్తూనే ఉన్నాయి. బదిలీ అయిన తర్వాత జీతాలు రావడంలేదని వైద్యులు, సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం జూలైలో సాధారణ బదిలీలను చేపట్టింది. వైద్యారోగ్య శాఖలో సీనియార్టీ జాబితా, వెకెన్సీ జాబితా, బదిలీల మినహాయింపు పత్రాల విషయంలో తీవ్ర అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. కాలక్రమేణా ఈ అంశం మరుగునపడినా.. విచ్చలవిడిగా చేసిన బదిలీల కారణంగా వైద్యులు, సిబ్బంది ఇప్పటికీ అవస్థలు పడుతూనే ఉన్నారు. తమకు కొత్త స్టేషన్ (జిల్లా/ప్రాంతం)లో చేరిన తర్వాత జీతాలు అందడంలేదని వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, సిబ్బంది వాపోతున్నారు. కొందరికి బదిలీ అయినప్పటి నుంచి జీతాలు అందకపోగా, మరికొందరికి బదిలీ అయిన నెలలో కొంత జీతం పెండింగ్‌లో ఉన్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యసిబ్బందిలో చాలా వరకు కొత్త స్టేషన్‌కు వెళ్లిన తర్వాత జీతం రాలేదని చెప్తున్నారు. 'హైదరాబాద్ నుంచి సిద్దిపేట జిల్లాకు బదిలీ అయ్యాను. ఇప్పటివరకు జీతం రాలేదు' అని ఓ డాక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరికి బదిలీ అయిన నెలలో.. బదిలీకి ముందు పనిచేసిన రోజుల వరకే జీతం వచ్చిందని, కొత్త స్టేషన్‌లో చేరిన తర్వాత ఆ నెలలోని మిగతా రోజులకు జీతం పడలేదని చెప్తున్నారు. 'నేను హైదరాబాద్ నుంచి మేడ్చల్ జిల్లాకు జూలై మూడో వారంలో బదిలీపై వెళ్లాను. జూలైలో మొదటి మూడు వారాలకు హైదరాబాద్‌లో జీతం వచ్చింది. కానీ మిగతా వారం రోజులకు సంబంధించిన వేతనం మేడ్చల్ జిల్లాలో రాలేదు' అని ఓ నర్సింగ్ ఆఫీసర్ వాపోయారు. ఇలా జీతాలు పెండింగ్‌లో ఉండటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు.

## జనాభాను లెక్కిస్తేనే బీసీ రిజర్వేషన్!

- ఎక్కడైనా రేషన్ తీసుకునే అవకాశం కల్పిస్తాం
- 9 నెలల్లో ఒక్క సెలవూ తీసుకోలేదు
- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటే కచ్చితంగా జనాభాను లెక్కించాల్సిందేనని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి అయినా రేషన్ తీసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. తొమ్మిది నెలల్లో ఒక్క రోజు కూడా తాను సెలవు తీసుకోలేదని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన సీఎల్పీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు తీసుకురాబోతున్నామని, రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ హెల్త్ ప్రొఫైల్ డిజిటల్ కార్డు అందజేస్తామని చెప్పారు. రైతు రుణ విముక్తి కావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా 27 రోజుల్లో 18 వేల కోట్ల రైతు రుణ మాఫీ చేయలేదని పేర్కొన్నారు. నాలుగోసారి గెలవడం కోసమే ప్రధాని మోదీ జమిలీ అంశం ఎత్తుకున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాహుల్ ఆలోచన మేరకు బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులను నియమించామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై ఉత్తమ్ కుమార్‌రెడ్డి నాయకత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. పార్టీ నాయకత్వం ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. నరేంద్రమోదీని ఓడించాల్సిన చారిత్రాత్మక అవసరం ఉన్న సమయంలో పీసీసీ చీఫ్‌గా మహేశ్‌గౌడ్ బాధ్యతలు చేపట్టారని తెలిపారు.

## విజయ పాడి రైతులకు త్వరలో బిల్లులు

**డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ప్రకటన**

హైదరాబాద్, సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ): విజయ డెయిరీ పాడి రైతులకు త్వరలోనే బిల్లులు చెల్లిస్తామని తెలంగాణ డెయిరీ డెలవప్‌మెంట్ సొసైటీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి తెలిపారు. అప్పటిదాకా రైతులు సహకరించాలని ఆదివారం ప్రకటనలో కోరారు. విజయ డెయిరీ ద్వారా నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులను విక్రయిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఆదరించి సంస్థ సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. నిత్యం 4.20 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నామని, మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో పొరుగు రాష్ట్రాల డెయిరీలు తక్కువ ధరకే పాలు, పాల ఉత్పత్తులను విక్రయిస్తుండటంతో విజయ డెయిరీ ఉత్పత్తుల అమ్మకాలు పడిపోయాయని పేర్కొన్నారు.

## 30లోగా సర్పంచుల బిల్లులపై తేల్చాలి

- లేకుంటే కార్యాలయాలను ముట్టడిస్తాం
- సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్యగౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులపై 30లోగా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్యగౌడ్ ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. లేకుంటే కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ధర్నాలు, నిరసనలతో స్తంభింపజేస్తామని హెచ్చరించారు. సమస్యలపై గవర్నర్‌తోపాటు ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, మంత్రులకు ఇప్పటికే చాలాసార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు.